సాక్షి నల్లగొండ

ఆదివారం । 15 । జూన్ । 2025



భక్తుల సందడి
యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి శనివారం భక్తులు తరలిరావడంతో సందడి నెలకొంది. - 8లో



దివ్యాంగులకు ఉచిత ప్రయాణం
కొత్తూరుకు చెందిన అందుగుల సైదులు తన ఆటోలో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాడు. - 8లో



విప్ ఇంట్లో వ్యక్తి ఆత్మహత్య
ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇంట్లో పనిచేసే వ్యక్తి గంధమల్ల రవి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. - 8లో

న్యూస్‌రీల్

హోటళ్ల యజమానులు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ: హోటల్స్, దాబాలు, రెస్టారెంట్ల యజమానులు నిబంధనలు పాటించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో దాబా హోటళ్ల యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో హైవేపై ఉన్న హోటల్స్, దాబాలు, రెస్టారెంట్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. దొంగతనాలు, నేరాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాలు ఉపయోగపడతాయన్నారు. దాబాల వద్ద వాహనదారులు ఆగే సమయంలో అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నియంత్రణకు హైవేపై వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. హోటల్స్ వద్ద సరైన పార్కింగ్ ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని దాబా హోటళ్ల యజమానులను ఆదేశించారు. దాబాల వద్దకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిపోయే వాహనదారుల వివరాలు తీసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్‌కు అప్పగించాలన్నారు. దాబాలు, రెస్టారెంట్లలో మద్యం, గంజాయి విక్రయించడం, సేవించడం వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, టూటౌన్ సీఐ రాఘవరావు, ఎస్బీ సీఐ రాము, ఎస్ఐ సైదులు, హోటళ్ల యజమానులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు


అయిటిపాముల ఆయిల్ పామ్ సాగును పరిశీలిస్తున్న ఉద్యాన వన అధికారి శ్వేత

కట్టంగూర్ : ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ప్రాంతీయ ఉద్యాన అధికారి శ్వేత అన్నారు. శనివారం కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామంలో చెరుకు లక్ష్మి వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటి మాట్లాడారు. ఆయిల్ పామ్ అధిక దిగుబడులు ఇస్తుందని, మార్కెట్ సంబంధం లేకుండా కంపెనీ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఎకరం ఆయిల్ పామ్ సాగుతో రూ.1.25 లక్షలు ఆదాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పతంజలి ఫుడ్స్ నల్లగొండ జిల్లా మేనేజర్ నర్రా రవీందర్‌రెడ్డి, చిట్యాల డివిజన్ అధికారి వినయ్‌కుమార్, రామదాసు, శీను, ప్రసాద్ ఉన్నారు.

యాదగిరీశుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం నిత్యారాధనలో భాగంగా శ్రీస్వామి, అమ్మవార్ల నిత్యకల్యాణ వేడుక నేత్రపర్వంగా సాగింది. ప్రభాతవేళ స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూ, సువర్ణ ప్రతిష్ఠా అలంకార మూర్తులకు అభిషేకం, తులసీదళ అర్చన చేశారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, స్వామి,అమ్మవార్ల నిత్యకల్యాణం ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. ముఖ మండపంలో బ్రహ్మోత్సవం నిర్వహించారు.

నడిపించిన నాన్న..

పిల్లలను పక్షి వలే తన రెక్కలతో కాపాడుతూ.. వారి కష్టసుఖాల్లో నేనున్నానంటూ వెన్నుతట్టి నడిపించేది నాన్న. పిల్లల విజయాన్ని తన గెలుపుగా భావించి వారి కోసం ఎంతటి కష్టాన్నైనా ఎదుర్కొంటాడు నాన్న. పిల్లల జీవితాల్లో వెలుగు నింపేందుకు తాను కొవ్వొత్తిలా కరుగుతాడు నాన్న. ఓర్పుకు మారుపేరు.. మార్పుకు మార్గదర్శి.. నీతికి నిదర్శనం.. మన ప్రగతికి సోపానం నాన్నే.

నేడు ఫాదర్స్‌డే సందర్భంగా ప్రత్యేక కథనాలు 8లో



పద్మ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ పురస్కాలు–2026కు అర్హులైన వారి నుంచి కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్, ఇంజనీరింగ్, పబ్లిక్ అఫైర్స్, సివిల్ సర్వీస్, వాణిజ్యం పరిశ్రమలు తదితర రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి వచ్చే ఏడాది గణతంత్ర దినోత్సవం నాడు ఈ అవార్డులు అందజేస్తారని పేర్కొన్నారు. మహిళలు, ఎస్సీ, తెగలు, దివ్యాంగులలో ప్రతిభావంతులు వారి నామినేషన్లను awardsr.gov.in వెబ్‌సైట్ ద్వారా రాష్ట్రపతి పురస్కార్ పోర్టల్ awrdrs.gov.inలో జూలై 31లోగా పంపాలని తెలిపారు.

డ్రైవింగ్ ట్రాక్.. తరలింపు!

కలెక్టరేట్ విస్తరణకు ఆర్‌టీఏ డ్రైవింగ్ ట్రాక్ తొలగించాలని నిర్ణయం


కొనసాగుతున్న అదనపు కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు


ఆర్‌టీఏ కార్యాలయం ప్రహరీని తొలగించిన దృశ్యం

- నల్లగొండ సమీపంలో దండెంపల్లిలో ఏర్పాటు చేయాలనే ఆలోచన
- అదే జరిగితే.. లైసెన్స్ కోసం కార్యాలయానికి, టెస్టులకు దండెంపల్లి వెళ్లాల్సిందే..
- వాహనదారులకు ఇబ్బందులే..
- ట్రాక్ వరకు స్థలాన్ని వదిలేయాలంటున్న ఆర్‌టీఏ సిబ్బంది

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కలెక్టరేట్ విస్తరణలో రవాణా శాఖ (ఆర్‌టీఏ) కార్యాలయంలోని డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ మార్పు తప్పేలా లేదు. కలెక్టరేట్ విస్తరణలో భాగంగా కార్యాలయాన్ని ఆనుకొని ఉన్న ఆర్‌టీఏ కార్యాలయంలోని ట్రాక్ ఉన్న స్థలంలో కలెక్టరేట్ అదనపు బ్లాక్‌ను నిర్మించాలని జిల్లా యంత్రాంగం ఇటీవల నిర్ణయించింది. ఇందుకు జిల్లా మంత్రులు శంకుస్థాపన చేశారు. దీంతో చదును చేసే పనులను కూడా ప్రారంభించారు. ఇప్పటికే ఆర్‌టీఏ కార్యాలయం ప్రహరీని తొలగించారు. ట్రాక్ కూడా అక్కడ నుంచి తొలగించాల్సి వస్తోంది. ఊరి చివరలో ఉన్న దండెంపల్లికి ట్రాక్‌ను మార్చేందుకు చర్యలు చేపడుతున్నారు. దీంతో ఆర్‌టీఏ కార్యాలయానికి డ్రైవింగ్ టెస్టుల కోసం వచ్చే వారికి భవిష్యత్‌లో తిప్పలు తప్పేలా కనిపించడం లేదు.

పదేళ్ల క్రితం నుంచి ఒకేచోట..

ఆర్‌టీఏ కార్యాలయం గతంలో హైదరాబాద్ రోడ్డులో ప్రైవేట్ భవనంలో ఉండేది. మరోవైపు ట్రాక్ మాత్రం ప్రస్తుతం ఉన్న ఆర్‌టీఏ కార్యాలయ ఆవరణలో ఉండేది. దీంతో వాహనదారులు రెండు చోట్లకు వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్ వెనుక భాగంలోని ప్రభుత్వ స్థలంలో పదేళ్ల కిందట సొంత భవనాన్ని నిర్మించారు. దీంతో లైసెన్స్‌ల కోసం కార్యాలయ పనితోపాటు డ్రైవింగ్ టెస్టులు ఒకేచోటకు రావడంతో ఇబ్బందులు తప్పాయి. ప్రస్తుతం మళ్లీ కలెక్టరేట్ విస్తరణలో ఆర్‌టీఏ కార్యాలయం మార్చాల్సి వస్తుందడంతో జనాలకు ఇబ్బందులు తప్పేలా లేవు.

ట్రాక్ తరలిస్తే ఇబ్బందులే..

డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌ను దండెంపల్లిలో ఏర్పాటు చేసి, రవాణా కార్యాలయాన్ని మాత్రం అక్కడే ఉంచేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్స్, రెన్యువల్ ఇతరత్రా కార్యాలయ పనుల కోసం కలెక్టరేట్ వెనుక ఉన్న ఆర్‌టీఏ కార్యాలయానికి వెళ్లాలి. ఇక ట్రాక్‌ను దండెంపల్లికి తరలిస్తే డ్రైవింగ్ టెస్టు కోసం అక్కడికి వెళ్లాల్సిందే. జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి వచ్చేవారు ఆర్‌టీఏ కార్యాలయానికి రావడమే కష్టం. అలాంటిది ఒక పనికోసం ఇటు ఆర్‌టీఏ కార్యాలయానికి, అటు దండంపల్లికి వెళ్లి టెస్టింగ్‌లు చేయాలంటే మరింత ఇబ్బందులు తప్పేలా లేవు. ఈ టెస్టుల కోసం ప్రతినెలా వచ్చే వందల మంది ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి రాబోతోంది.

దండంపల్లికి మార్చేలా..

ప్రస్తుతం కలెక్టరేట్ వెనుక భాగంలో రూ.33 కోట్లతో కలెక్టరేట్ అదనపు భవనాన్ని నిర్మిస్తున్నారు. రెండు నెలల కిందట జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే అప్పటి నుంచి ఆ భవన నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని చదును చేస్తున్నారు. అందులో భాగంగా కలెక్టరేట్‌కు ఆర్‌టీఏ కార్యాలయానికి మధ్య ఉన్న ప్రహరీని తొలగించారు. దాంతోపాటు ఆర్‌టీఏ కార్యాలయంలోని డ్రైవింగ్ టెస్టులు నిర్వహించే ట్రాక్‌ను కూడా అక్కడ నుంచి తొలగించి ఆ స్థలాన్ని కూడా కలెక్టరేట్‌కు వినియోగించేలా పక్కనే చదును చేస్తున్నారు. ట్రాక్ కోసం అధికారులు ఇప్పటికే నల్లగొండ పట్టణ సమీపంలోని హైదరాబాద్ రోడ్డులో, అలాగే దండెంపల్లిలో స్థలాలను పరిశీలించారు. హైదరాబాద్ రోడ్డులో ఉన్న స్థలం లిటిగేషన్‌లో ఉండటంతో దండెంపల్లిలో గతంలో కోళ్ల పరిశ్రమ కోసం ఇచ్చిన స్థలం సమీపంలోనే టెస్టింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి వచ్చారు.

ట్రాక్ వరకు స్థలాన్ని వదిలేయాలంటున్న ఆర్‌టీఏ సిబ్బంది

ఆర్‌టీఏ కార్యాలయానికి గతంలోనే సొంత భవనం నిర్మించారు. స్థలం కూడా సరిపోను ఉంది. కలెక్టరేట్ విస్తరణలో కార్లు, ఇతర వాహనాలకు సంబంధించి డ్రైవింగ్ టెస్టు నిర్వహించేందుకు ప్రస్తుతం ఉన్న ట్రాక్‌ను వదిలేస్తే తమకు ఇబ్బందులు ఉండవని రవాణా శాఖ సిబ్బంది చెబుతున్నారు. ఆ ట్రాక్ స్థలాన్ని ఆర్‌టీఏ కార్యాలయానికి ఉంచాలని కోరుతున్నారు. కావాలంటే ట్రాక్ పక్కనుంచి ఆర్టీఏ కార్యాలయం వరకు వెనుకవైపు ఉన్న స్థలాన్ని తీసుకోవాలని, ట్రాక్‌ను అక్కడే ఉంచాలంటున్నారు.

21,660 కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి నాగరాజు

- జిల్లా ప్రధాన జడ్జి నాగరాజు
- 12 ప్రత్యేక బెంచ్‌లలో లోక్‌అదాలత్

రామగిరి(నల్లగొండ): జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులు త్వరితగతిన పరిష్కారమై సత్వర న్యాయం అందుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు అన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించి జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాజీమార్గమే రాజమార్గం అన్ని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 12 లోక్ అదాలత్ బెంచీలను ఏర్పాటు చేసి 38 సివిల్, 15,837 క్రిమినలు, 85 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, 28 బ్యాంకు కేసులు, 25 సైబర్ క్రైమ్ కేసులు, 80 ట్రాన్స్‌కో, 5,567 ట్రాఫిక్ చలాన్ కేసులతో కలిపి మొత్తం 21,660 (పెండింగ్, ప్రీ లిటిగేషన్) కేసులు పరిష్కరించామన్నారు. ప్రమాద బీమా కేసుల్లో బాధితులకు రూ.4,75,29,000 నష్టపరిహారం ఇప్పించగా రూ.30,21,000 బ్యాంకు కేసులలో రుణపరిహారం అందజేశారు. సైబర్ క్రైం కేసులో రికవరీ డబ్బులు రూ.2,03,112 అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి కార్యదర్శి పి.పురుషోత్తమ్‌రావు, ఇతర న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కట్ట అనంత రెడ్డి, మంద నగేష్, ఇతర న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.


కక్షిదారుకు అంగీకార పత్రాన్ని అందజేస్తున్న జిల్లా ప్రధాన జడ్జి నాగరాజు

21న సీఎం రేవంత్‌రెడ్డి రాక

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : నాగార్జునసాగర్ నియోజకవర్గం పరిధిలోని తిరుమలగిరి సాగర్ మండలంలో ఈ నెల 21వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పర్యటించనున్నట్లు తెలిసింది. మండలంలో భూ భారతి అమలు తీరును పరిశీలించటంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం పాల్గొనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భూ ప్రక్షాళనలో భాగంగా ధరణి స్థానంలో భూభారతిని తీసుకువచ్చే క్రమంలో భూ సమస్యలను పరిష్కరించేందుకు గాను క్షేత్రస్థాయి అధ్యయానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అందులో భాగంగా నూతన ఆర్‌ఓఆర్ 2025 చట్టాన్ని తీసుకొచ్చే క్రమంలో అనేక భూ సమస్యలు ఉన్న తిరుమలగిరి సాగర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. దీంతో అన్ని రకాల భూ సమస్యల పరిష్కారానికి మార్గం సుగుమమైంది. దీనిలో భాగంగా గత సంవత్సరం ఆగస్టు 5వ తేదీన నాటి కలెక్టర్ నారాయణరెడ్డి చింతలపాలెంలో గ్రామసభను ఏర్పాటు చేసి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న భూ సర్వేపై దిశా నిర్దేశం చేశారు. సుమారు ఏడు నెలలుగా 14 రెవెన్యూ, సర్వే బృందాలు, 80 మంది సిబ్బందితో కాస్తు, కబ్జా ఆధారంగా సర్వేను నిర్వహించారు. దీంతో అర్హులైన రైతులకు సుమారు ఐదు వేల ఎకరాలకు సంబంధించిన పట్టాలను ఈ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కారమై సీఎం చేతుల మీదుగా పట్టాలు అందుకోనుండడంతో మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేయాలి


రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో పాల్గొన్న సునీతారావు, ఇతర మహిళా నాయకురాళ్లు

- రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు

నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలంతా సమష్టిగా కృషిచేయాలని ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని మంత్రి కోమటి రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళా కాంగ్రెస్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు వస్తుందన్నారు. ఈ సందర్భంగా వివిధ పదవుల్లో నియమించిన వారికి నియామక పత్రాలు అందజేశారు. అనంతరం రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రంలో భాగంగా దేవరకొండ రోడ్డులో ఉన్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని లైన్‌వాడ కాలనీలో గల కాంగ్రెస్ కార్యకర్త ఇంట్లో సన్న బియ్యంతో వండిన భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి, నాయకురాళ్లు దుబ్బ రూప, నాగమణి, జాన్, సుజాత, రాజ్యలక్ష్మి, సురెడ్డి సరస్వతి పాల్గొన్నారు.


లైన్‌వాడ కాలనీలో కాంగ్రెస్ కార్యకర్త ఇంట్లో భోజనం చేస్తున్న సునీతారావు తదితరులు

డిగ్రీలో ప్రవేశాలకు 23లోగా దరఖాస్తు చేసుకోవాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: నల్లగొండ సమీపంలోని చర్లపల్లిలో గల ఎస్సీ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి డిగ్రీ ఫస్టియర్‌లో ప్రవేశానికి ఇంటర్ పూర్తి చేసినవారు ఈ నెల 23లోగా దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నల్లగొండ కలెక్టరేట్‌లో శనివారం ఆమె డిగ్రీలో ప్రవేశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బీఎస్సీ, బీకాం, బీఏ కోర్సులకు దరఖాస్తు చేసుకునే వారు పదవ తరగతి, ఇంటర్ మార్కుల మెమో, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, 5 పాస్ ఫొటోలతో పాటుగా జనవరి 2025 తర్వాత పొందిన తాజా ఆదాయ ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుకు జతచేసి నేరుగా కళాశాలలో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పవిత్ర వాణికర్ష, కళాశాల అడ్మిషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

'రైతు నేస్తం' వీక్షించేలా ఏర్పాట్లు చేయాలి

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ఈనెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులంతా వీక్షించేలా రైతు వేదికల్లో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతు నేస్తం కార్యక్రమం ఏర్పాట్ల విషయమై శనివారం ఆమె వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో నల్లగొండ కలెక్టరేట్ నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. జిల్లాలోని 140 రైతు వేదికల్లో 32 వీడియో కాన్ఫరెన్స్‌కు అనుగుణంగా ఉన్నాయన్నారు. ప్రతి రైతు వేదికను మామిడి తోరణాలు, కొబ్బరి మట్టలు, పూలతో అలంకరించాలన్నారు. రైతువేదికల్లో జరిగే రైతు నేస్తానికి సంబంధిత అధికారులు విధిగా హాజరు కావాలని సూచించారు.

రూ.1.50 లక్షల విలువైన చీరలు బహూకరణ

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి భూదాన్‌పోచంపల్లికి చెందిన చేనేత వ్యాపారి బొడ్డు శ్రీధర్, నవీన్‌లు రూ.1.50లక్షలు విలువ చేసే కంచి పట్టు చీరలు బహూకరించారు. శనివారం స్వామి వారిని దర్శించుకున్న అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తుల చెంత ఆలయ అధికారి గజవెల్లి రఘుకు చీరలను అందజేశారు. వీటిని శ్రీస్వామి, అమ్మవారికి అలంకరణలో వినియోగించనున్నారు.


చీరలు అందజేస్తున్నబొడ్డు శ్రీధర్, నవీన్

ఆటోడ్రైవర్ నుంచి ఆర్టీసీ డ్రైవర్‌గా

- ఆర్టీసీ డ్రైవర్‌గా సరితనాయక్
- ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ నుంచి తెలంగాణ ఆర్టీసీలో చేరిక


మంత్రి కోమటిరెడ్డిని కలిసిన సరితనాయక్ (ఫైల్)

సంస్థాన్ నారాయణపురం: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో డ్రైవర్‌గా చేరి.. తొలి మహిళా బస్సు డ్రైవర్‌గా రికార్డు సొంతం చేసుకుంది యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సీత్యాతండాకు చెందిన సరిత నాయక్. మారుమూల గిరిజన తండాలో పుట్టి పెరిగిన సరిత ఇప్పటికే ఢిల్లీలో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లో బస్సు చక్రం తిప్పి దేశంలోనే బస్సును నడిపిన మొదటి మహిళగా పేరు తెచ్చుకుంది. తాజాగా ఆమె తెలంగాణ ఆర్టీసీలో డ్రైవర్‌గా విధుల్లో చేరారు. అమ్మా నాన్నలు రాంకోటి, రుక్కలు. సరిత కుటుంబంలో నలుగురు అక్కలు, ఒక తమ్ముడు ఉన్నారు. అక్క దగ్గర ఉంటూ దేవరకొండలో 8వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాల చదివి, అక్కడ నుంచి 10వ తరగతి వరకు ఓపెన్ స్కూల్‌లో చదివింది. సరిత కొన్ని రోజులు దేవరకొండలో.. తర్వాత ఐదు సంవత్సరాలు సంస్థాన్ నారాయణపురం నుంచి సీత్యాతండా వరకు ఆటో నడిపింది. ఆటో నడుపుతున్న సందర్భంగా ఎదురైన ఇబ్బందులును ఎదుర్కోవడానికి పురుషుల మాదిరిగా వేషధారణ మార్చింది హైదారాబాద్‌లోని బంధువులు ఇంట్లో ఉంటూ బస్సు డ్రైవింగ్ నేర్చుకుంది. తర్వాత కాలంలో హెవీ వెహికిల్స్ డ్రైవింగ్ లైసెన్స్ కూడా తీసుకుంది. తెలంగాణలో ఉద్యోగం చేయాలని సరిత గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు విన్నవించింది. హామీ ఇచ్చినప్పటికీ అమలు కాలేదు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి , మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లింది. మంత్రి వెంకట్‌రెడ్డి ఆమె హామీ ఇచ్చారు. తాజాగా ఆమె ఎంజీబీఎస్ డిపోలో పోస్టింగ్ పొందారు. శనివారం ఆమె ఎంజీబీఎస్ నుంచి మిర్యాలగూడ వరకు నాన్‌స్టాప్ బస్సు నడిపారు.



శనివారం తెలంగాణ ఆర్టీసీలో డ్రైవర్‌గా విధుల్లో చేరిన సరితనాయక్

పాతాళగంగ పైపైకి..

- 2.32 మీటర్లు వృద్ధిచెందిన భూగర్భ జలాలు
- గత మే నెలతో పోలిస్తే భారీగా పెరుగుదల
- గతేడాది 10.83 మీటర్ల లోతున
- ఈ ఏడాది 8.53 మీటర్లపైకి..

నల్లగొండ: పాతాళగంగ పైపైకి వస్తోంది. గతేడాది మే నెలతో పోలిస్తే జిల్లాలో ఈ ఏడాది మే వరకు భూగర్భ జలాలు పెరిగాయి. గతంలో 10.83 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలు అకాల వర్షాల కారణంగా వృద్ధి చెంది 8.51 మీటర్ల పైకి ఎగబాకాయి. ఈసారి రుతు పవనాలు ముందే వస్తాయని భావించిన అవి వెనుకపట్టే పట్టాయి. అదే సందర్భంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా విస్తారంగా వర్షాలు పడ్డాయి. దీంతో చెరువులు, కుంటలకు వరదనీరు రావడానికి తోడు కృష్ణాజలాలు సైతం విడుదల కావడంతో భూగర్భ జలాలు ఆశాజనకంగా పెరిగాయి.

మిర్యాలగూడ మండలంలో 2.27 మీటర్లలోతులోనే..

గత సంవత్సరం మే వరకు భూగర్భ జలాలు 10.83 మీటర్ల లోతులో ఉండగా ఈ ఏడాది ఎండాకాలంలో సైతం అకాల వర్షాలు కురవడంతో మే నెలలో 8.51 మీటర్లకు ఎగబాకి గతేడాది కంటే 2.32 మీటర్ల పైకి చేరువయ్యాయి. మిర్యాలగూడ మండలంలో 2.27 మీటర్ల లోతులో భూగర్భజలాలు లభిస్తూ ముందంజలో ఉండగా చిట్యాల మండలంలో 13.94 మీటర్ల లోతులో భూగర్భ జలం లభిస్తూ వెనుకంజలో ఉంది. గతేడాది కంటే అంతటా భూగర్భజల మట్టాలు వృద్ధి చెందడంతో వ్యవసాయ బోర్లకు సమృద్ధిగా నీరందుతోంది. ఫలితంగా రైతులు వానాకాలం సాగుకు సమాయత్తం అవుతున్నారు.

మండలాల వారీగా భూగర్భజలాలు ..

మండలం	మే 2024	మే 2025						
అడవిదేవులపల్లి	18.03	3.62	గుర్రంపోడు	9.07	5.42	నాంపల్లి	6.88	7.89
అనుముల	9.21	6.43	కనగల్	12.64	7.20	నార్కట్‌పల్లి	10.45	8.69
చందంపేట	18.14	9.58	కట్టంగూర్	11.92	10.64	నేరడుగొమ్ము	16.98	9.32
చండూరు	9.79	11.26	కేతేపల్లి	4.32	3.04	నిడమనూరు	13.34	9.51
చింతపల్లి	12.74	12.70	కె.మల్లేపల్లి	5.37	5.99	పీఏపల్లి	6.48	5.29
చిట్యాల	14.34	13.94	మాడ్గులపల్లి	11.43	7.07	పెద్దవూర	9.94	7.09
దామరచర్ల	20.65	13.37	మర్రిగూడ	9.27	12.56	శాలిగౌరారం	7.10	5.85
దేవరకొండ	11.22	9.44	మిర్యాలగూడ	7.72	2.27	తిప్పర్తి	6.53	2.72
గట్టుప్పల్	7.61	9.70	మునుగోడు	13.45	11.65	టి.సాగర్	14.31	10.02
గుండ్లపల్లి	8.27	6.42	నకిరేకల్	10.21	7.66	త్రిపురారం	7.10	2.54
			నల్లగొండ	9.48	9.42	వేములపల్లి	8.29	3.89



క్లుప్తంగా

నృసింహుడి సన్నిధిలో భక్తుల సందడి


మాడ వీధిలో కిటకిటలాడుతున్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. రెండో శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు, ముఖ మండపం, మాడ వీధులు, కొండ కింద భక్తులు కిటకిటలాడారు. ధర్మ దర్శనానికి 3గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. 40వేలకు మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.49,88,217 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

యాదగిరీశుడిని దర్శించుకున్న ఛత్తీస్‌గఢ్ పీఎస్‌సీ చైర్‌పర్సన్

లక్ష్మీనరసింహస్వామిని ఛత్తీగఢ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(సీజీపీఎస్‌సీ) చైర్‌పర్సన్ రీటా శాండిల్య శనివారం దర్శించుకున్నారు. ఆమెకు అర్చకులు, తహసీల్దార్ గణేష్ స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

రమణేశ్వరంలో నమక మంత్రాల ప్రవచనాలు


రుద్ర హవనం చేస్తున్న రమణానంద మహర్షి

భువనగిరి: భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామ పరిధిలోని రమణేశ్వరంలో గల శివశక్తి షిర్డీ సాయి అనుగ్రహ మహాపీఠంలో శనివారం సిద్ధ గురు రమణానంద మహర్షి 66 నమక మంత్రాలపై ప్రవచించారు. అనంతరం మహాపీఠం ఆవరణంలో రుద్ర హవనం, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

నడిపించిన నాన్న

- పిల్లల విజయాన్ని తమ గెలుపుగా భావిస్తున్న నాన్నలు
- సంతానాన్ని సమాజంలో ఉన్నతంగా నిలబెట్టేందుకు కృషి
- బిడ్డల ఆశలే ఆయువుగా.. వారి గెలుపే లక్ష్యంగా ముందుకు

నేడు ఫాదర్స్ డే

నాన్నంటే.. బలం, బంధం, బాధ్యత, భరోసా, సంతోషం, సర్వస్వం. అమ్మ ప్రాణం పోస్తే.. ఆ ప్రాణానికి ఓ రూపాన్ని ఇచ్చేది నాన్న. మనం గెలిచినప్పుడు పది మందికి ఆనందంగా చెప్పుకుని, మనం ఓడినప్పుడు నువ్వు గెలుస్తావులే అంటూ ధైర్యాన్నిచ్చేది నాన్నే. బిడ్డల ఆశలే ఆయువుగా.. వారి గెలుపే లక్ష్యంగా.. పిల్లలను జీవితంలో నిలబెట్టేందుకు తాను కరుగుతూ అనునిత్యం శ్రమించే నిజమైన దేవుడు నాన్న. నిత్య శ్రామికుడు.. స్నేహితుడు.. సన్నిహితుడు.. కలల వారధి.. పిల్లలను ముందుండి నడిపించే సారథి నాన్నే. ప్రపంచమంతా మనకు వ్యతిరేకంగా ఉన్నా.. నేనున్నానంటూ వెన్నుతట్టేది నాన్న మాత్రమే. నేడు ఫాదర్స్ డే సందర్భంగా.. తమ పిల్లల విజయానికి బాటలు వేసిన నాన్నలపై ప్రత్యేక కథనాలు.

ఆటో నడుపుతూ.. కొడుకును ఎంబీబీఎస్ చదివిస్తూ..


కుమారుడు అద్నాన్‌తో తండ్రి జహంగీర్

భువనగిరి : భువనగిరి పట్టణంలోని పహడీనగర్‌కు చెందిన షేక్ జహంగీర్, నసీం దంపతులకు కుమారుడు అద్నాన్, కుమార్తె ఉన్నారు. తన కొడుకును డాక్టర్ చేయాలని జహంగీర్ సంకల్పించాడు. వివాహం తర్వాత కొన్ని సంవత్సరాలు భువనగిరి నుంచి చౌటుప్పల్‌కు వెళ్లి అక్కడ వెల్డింగ్ వర్క్‌షాపులో పనిచేస్తూ తమ పిల్లలను చదివిస్తూ, కుటుంబాన్ని పోషించాడు. కొన్ని సంవత్సరాల క్రితం వలిగొండ నుంచి భువనగిరికి బైక్‌పై వస్తుండగా అనాజీపురం వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. గాయాల నుంచి కోలుకున్న అనంతరం ఆటో కొనుగోలు చేసి భువనగిరిలో నడుపుకుంటూ పిల్లల చదువును కొనసాగించాడు. పిల్లల చదువుల కోసం అప్పులు సైతం చేశాడు. ఇంటర్ పూర్తయిన వెంటనే నీట్ ర్యాంకు రాలేదు. రెండేళ్లు కోచింగ్ ఇప్పించాడు. అద్నాన్ 2023లో నీట్ ర్యాంకు సాధించి ప్రస్తుతం జనగాంలోని ప్రభుత్వం మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కుమార్తె ఓ ప్రైవేట్ కళాశాలలోనే బీటెక్ చదువుతోంది. పిల్లల చదువు కోసం రూ.లక్షలు అప్పు చేశాడు. అప్పులను తీర్చేందుకు ఆటో నడుతుతూనే ఉన్నాడు జహంగీర్.


భువనగిరిలో ఆటో నడుపుతున్న జహంగీర్

కొడుకు కలను నెరవేర్చి


వ్యానులో సామగ్రిని సర్దుకుంటున్న వీరమళ్ల శ్రీమన్నారాయణ

చౌటుప్పల్ : చౌటుప్పల్‌కు చెందిన వీరమళ్ల శ్రీమన్నారాయణ–విజయ దంపతులకు కుమారుడు దయాకర్, కుమార్తె రాజ్యలక్ష్మి ఉన్నారు. శ్రీమన్నానారాయణకు ఆరుగురు అన్నదమ్ముళ్లు. ఉమ్మడి కుటుంబంలో మొదలైన కష్టాలు వారికి ఇప్పటికీ వెంటాడుతూనే ఉన్నాయి. తాము అనుభవించిన కష్టాలు తమ బిడ్డలకు రావొద్దన్న ఆలోచనతో ఈ దంపతులు ఎంతో శ్రమించారు. ప్రస్తుతం గ్రామాల్లోని కిరాణా దుకాణాలకు మార్కెటింగ్ చేస్తున్నాడు. దయాకర్ చిన్నతనం నుంచి కోరుకున్న విధంగా డాక్టర్‌గా తీర్చిదిద్దాడు. తనకు వచ్చిన సంపాదనతో ఉన్నంతలోనే ఖర్చు చేసుకొని కొంత మొత్తాన్ని కుమారుడి ఎదుగుదల కోసం వెచ్చించాడు. అలా వైద్య విద్య పూర్తి చేసుకున్న దయాకర్ చౌటుప్పల్‌లోనే తల్లిదండ్రుల వద్ద ఉంటూనే స్థానికంగా ఉన్న నాలుగు పరిశ్రమల్లో ఫ్యాక్టరీ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం డాక్టర్‌గా మంచిస్థానంలోనే ఉన్నాడు.

నాన్న ఎంతో శ్రమించారు



మాది పేద కుటుంబం. రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి. నన్ను చిన్నతం నుంచి హైదరాబాద్‌లోనే హాస్టల్ ఉంచి చదివించాడు. డాక్టర్ కావాలన్న నా చిన్ననాటి కోరికను నెరవేర్చేందుకు అమ్మానాన్నలు పడిన కష్టం ఎన్నటికీ మరువలేను. కుటుంబం గడవడమే కష్టంగా ఉన్న పరిస్థితుల్లో కూడా నాకు ఏ లోటూ రాకుండా చూశారు. చదువు పూర్తవ్వగా ప్రస్తుతం ఫ్యాక్టరీ మెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాను. ఇకపై నా తల్లితండ్రులకు ఎలాంటి కష్టం లేకుండా చూసుకుంటాను. – వీరమళ్ల దయాకర్

అన్నదమ్ములిద్దరూ వైద్య విద్య


కుమారులతో లక్ష్మీనారాయణ

పెద్దవూర: మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన నిరుపేద దళిత కుటుంబానికి చెందిన చినపాక లక్ష్మీనారాయణ–మంజుల దంపతులకు ఇద్దరు కుమారులు రాకేష్, రితీష్ ఉన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబంలో జన్మించిన లక్ష్మీనారాయణ ఆర్థిక పరిస్థితులతో ఉన్నత చదువులు చదవలేకపోయాడు. కార్మిక నాయకుడిగా పనిచేస్తూ తన పిల్లలను చదివిస్తున్నాడు. దీంతో తన కుమారులనైనా ఉన్నతులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో చిన్నప్పటినుంచే చదువుతో కలిగే ప్రయోజనాలను వివరించేవాడు. చదువుకు పేదరికం అడ్డుకాదని, ప్రభుత్వం కల్పించే సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటే ఏదైనా సాధించవచ్చునని నిరూపించారు.. ఆ అన్నదమ్ములు. గత విద్యాసంవత్సరంలో ఇద్దరూ ఒకేసారి ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించారు. విద్యాభ్యాసాన్ని అంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి మొదటి ప్రయత్నంలోనే ఎంబీబీఎస్ సీట్లు సాధించి తమ తండ్రికి బహుమతిగా ఇచ్చారు. చినపాక రాకేష్ ప్రస్తుతం ప్రభుత్వ మెడికల్ కళాశాల మహేశ్వరంలో, రెండో కుమారుడు చినపాక రితీష్ ప్రభుత్వ మెడికల్ కళాశాల కుత్బుల్లాపూర్‌లో ఎంబీబీఎస్ చదువుతున్నారు. వైద్యం అంటే వ్యాపారంగా మారిన నేపథ్యంలో మంచి డాక్టర్లుగా తయారై ప్రజలకు సేవ చేస్తామని వారు పేర్కొంటున్నారు.

నాన్న ప్రోత్సాహంతోనే..

మర్రిగూడ : మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నక్క శ్రీనివాస్‌యాదవ్ ఆండాలు దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు సంతానం. పదో తరగతి పూర్తి చేసిన శ్రీనివాస్ వ్యవసాయం చేసుకుంటూ.. లారీ డ్రైవర్‌గా పనిచేశాడు. ప్రస్తుతం మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవిలో ఉన్నారు. నలుగురు సంతానంలో పెద్ద కుమార్తె అయిన నక్క సంధ్య బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసి ఉద్యోగానికి సన్నద్ధమవుతోంది. రెండవ కుమార్తె స్వాతి బీటెక్ పూర్తి చేసి ప్రస్తుతం మెట్రో పాలిటిన్ జలమండలి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తోంది. మూడవ కుమార్తె ప్రియాంక డిగ్రీ పూర్తి చేసి రాచకొండ కమిషనరేట్‌లో సివిల్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తోంది. కుమారుడు సాయితేజ పెండెకంటి లా 4వ సంవత్సరం చదువుతున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన స్వాతి, ప్రియాంక మాట్లాడుతూ తండ్రి ప్రోత్సాహంతోనే ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాలు సాధించామని తెలిపారు.


తల్లిదండ్రులను సన్మానిస్తున్న కుమార్తెలు, కుమారుడు

ముగ్గురు పిల్లలను డాక్టర్లు చేసిన నాన్న..


తమ నలుగురు పిల్లలతో ఎస్‌కె.సుబాని, మహమూదాబేగం

మిర్యాలగూడ : పట్టణంలోని సీతారాంపురం ప్రాంతానికి చెందని ఎస్‌కె.సుబాని తొలుత ప్రైవేట్ టీచర్‌గా పని చేశారు. తర్వాత కలెక్టరేట్‌లో ఉద్యోగం సాధించి డిప్యూటీ తహసీల్దార్ బాధ్యతలు నిర్వహించారు. నిబద్ధతతో పని చేసి పలుమార్లు ఉత్తమ అవార్డులను సైతం అందుకున్నారు. ఆయనకు తమ నలుగురు పిల్లలను డాక్టర్లను చేయాలన్న లక్ష్యంతో వారిని ఉన్నత చదువులు చదివించారు. ప్రస్తుతం ఇద్దరు కుమారులు, ఒక కూతురు ప్రభుత్వ డాక్టర్లుగా కొనసాగుతుండగా మరో కుమారుడు ఎఫ్‌సీఐలో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. భార్య మహమూబాబేగంతో కలిసి ఎస్‌కె.సుబాని పిల్లలను సమాజంలో ఆదర్శంగా నిలిపారు.

తల్లి లేని లోటు తెలియనీయకుండా..

మోత్కూరు: భార్య చనిపోయినప్పటికీ మరో వివాహం చేసుకోకుండా తన పిల్లలకు తల్లి లేని లోటు తెలియనీయకుండా ఉన్నత చదువులు చదివిస్తున్నాడు మోత్కూరులోని అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన కురుమిళ్ల రమేష్. రమేష్‌కు మంజులతో 30ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమార్తె శ్రీకళ, కుమారులు దేవేందర్, కరుణాకర్ ఉన్నారు. మంజుల అనారోగ్యంతో 18ఏళ్ల క్రితం మృతిచెందింది. పిల్లలు చిన్న వయస్సులోనే ఉండగానే భార్య చనిపోవడంతో రమేష్ తన బాధను దిగమింగుకుంటూ మేస్త్రీగా పనిచేస్తూ పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దారు. ఇప్పుడు శ్రీకళ బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసి సౌదీ అరేబియాలో నర్సింగ్ ఉద్యోగం చేస్తోంది. పెద్ద కుమారుడు దేవేందర్ బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. చిన్న కుమారుడు కరుణాకర్ డీఎంఎల్‌టీ కోర్సు చదువుతున్నాడు. తన పిల్లలకు తల్లి లేని లోటును తీర్చడంతో పాటు వారిని బాగా చదివించి ప్రయోజకులుగా చేస్తున్న రమేష్‌ను పలువురు అభినందిస్తున్నారు.


తన ముగ్గురు పిల్లలతో రమేష్

ప్రభుత్వ విప్ ఐలయ్య ఇంట్లో వ్యక్తి ఆత్మహత్య

- నాల్గో అంతస్తులో ఉరేసుకున్న సహాయకుడు
- అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య ఫిర్యాదు


భువనగిరి ఆస్పత్రిలో రవి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట: ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇంట్లో పనిచేసే వ్యక్తి గంధమల్ల రవి(30) శుక్రవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం యాదగిరిగుట్ట పట్టణ సీఐ భాస్కర్, మృతుడి భార్య నవిత తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామానికి చెందిన గంధమల్ల రవి తన భార్య నవిత, పిల్లలతో కలిసి యాదగిరిగుట్టలోని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇంట్లో కొంతకాలంగా పనిచేస్తున్నారు. ఇక్కడకు రాక ముందు రవి సైదాపురం గ్రామంలోనే హోటల్ నిర్వహిస్తుండేవాడు. మద్యానికి బానిసైన రవి గురించి అతడి భార్య నవిత బీర్ల ఐలయ్యకు చెబితే ఆయన తన ఇంట్లోనే సహాయకుడిగా పనిచేయాలని, మద్యం తాగడం మానేయాలని సూచించారు. దీంతో యాదగిరిగుట్టలోని ఐలయ్య ఇంట్లో రవి పనిలో చేరి పిల్లలను చదివిస్తున్నాడు.

హోం లోన్ కట్టలేక..

అయితే మూడేళ్ల క్రితం రవి ప్రైవేట్ బ్యాంక్ నుంచి హోమ్ లోన్ తీసుకున్నాడు. ఈఎంఐలు సరిగ్గా కట్టకపోవడంతో బ్యాంక్ అధికారులు రవి ఇంటికి తాళం వేస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా సైదాపురం గ్రామంలో సైతం రవి పలువురి వద్ద అప్పులు చేశాడు. అప్పులు ఎక్కువ కావడంతో రవి మళ్లీ మద్యం తాగడం ప్రారంభించాడు. రెండు రోజుల క్రితం రవి ఇంటికి బ్యాంక్ అధికారులు ఈఎంఐ కట్టడం లేదని నోటీసులు అంటించి వెళ్లారు.


రవి (ఫైల్)

ఫోన్ చేస్తే లిఫ్ట్ చేస్తలేదని..

శుక్రవారం రాత్రి 9గంటలకు రవికి భార్య నవిత ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో రవి తల్లికి నవిత ఫోన్ చేయగా.. రవి సైదాపురం వచ్చి వెంటనే యాదగిరిగుట్టకు వచ్చాడని ఆమె తెలిపింది. దీంతో మరోసారి ఫోన్ చేసినా రవి లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి నవిత బీర్ల ఐలయ్య ఇంటి పైన పెంట్ హౌజ్‌లోకి వెళ్లి చూడగా.. రవి శాలువాతో ఉరేసుకుని కనిపించాడు. వెంటనే ఆమె గన్‌మెన్లు, బీర్ల ఐలయ్యకు సమాచారం ఇచ్చింది. వారు వెంటనే రవిని భువనగిరి ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే రవి మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రవి భౌతికకాయానికి భువనగిరి ఏరియా ఆస్పత్రిలో బీర్ల ఐలయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. పోస్టుమార్టం అనంతరం రవి మృతదేహాన్ని సొంత గ్రామమైన సైదాపురానికి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. రవి అంత్యక్రియలో బీర్ల ఐలయ్య పాల్గొన్నారు.

భార్య ఫిర్యాదుతో కేసు నమోదు..

మద్యానికి బానిస కావడంతో పాటు అప్పుల బాధతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు రవి భార్య నవిత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు యాదగిరిగుట్ట పట్టణ సీఐ భాస్కర్ తెలిపారు. రవి భార్యతో పాటు కుటుంబ సభ్యులు వాగ్మూలం సైతం నమోదు చేశామని, ఈ కేసును నిష్పక్షపాతంగా విచారణ చేపడుతున్నామన్నారు. ఎవరైనా సోషల్ మీడియాలో నిరాధారమైన ఆరోపణలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

విషం తాగి మహిళ ఆత్మహత్యాయత్నం

- సకాలంలో స్పందించి కాపాడిన పోలీసులు


మహిళకు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్న ఎస్ఐ సంపత్

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లోని హైలాన్‌కాలనీలో గల జెన్‌కో కార్యాలయం వద్ద శనివారం విషం తాగి ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ ప్రాణాలను విజయపురిటౌన్ పోలీసులు సకాలంలో స్పందించి కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన జస్విత(28) భర్త, అత్తమామల నుంచి వరకట్న వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో శనివారం ఆమె కారులో ఒంటరిగా బయల్దేరి మధ్యాహ్నానికి నాగార్జునసాగర్‌లోని హైలాన్‌కాలనీ జెన్‌కో కార్యాలయం వద్ద గల ఏటీఎం వద్దకు చేరుకుంది. అక్కడ తనతో పాటు తెచ్చుకున్న విషయం తాగి కారులోనే కూర్చుంది. కొద్దిసేపటి తర్వాత తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి తాను విషం తాగినట్లు చెప్పింది. హైదరాబాద్‌లోనే ఉంటున్న జస్విత తండ్రి సూర్య కూకట్‌పల్లి హౌజింగ్ బోర్డ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వారు నాగార్జునసాగర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ సంపత్ తన సిబ్బందితో కలిసి టెక్నాలజీ సహాయంతో జస్విత ఉన్న ప్రాంతాన్ని తెలుసుకుని కారులో అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను స్థానిక కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఆమె తల్లిదండ్రులకు అప్పగించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. సకాలంలో స్పందించిన పోలీసులకు జస్విత తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆటోలో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం


తన ఆటోతో సైదులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామ పరిధిలోని కొత్తూరు(బొద్దుగుట్ట)కు చెందిన అందుగుల సైదులు మూడు నెలల క్రితం కొత్త ఆటో కొన్నాడు. తన ఆటోలో దివ్యాంగులకు ఉచితంగా వారి గమ్యస్థానాలకు చేరవేస్తున్నాడు. గతంలో పాత ఆటో నడిపే సమయంలో ఓ దివ్యాంగుడు రోడ్డుపై ఎండలో నిలబడగా, అతడిని వద్దకు వెళ్లి ఎక్కడికి వెళ్లాలని అడగానని.. దానికి అతడు తన వద్ద డబ్బులు లేవు అని చెప్పడంతో ఎంతో బాధ అనిపించిందని సైదులు పేర్కొన్నాడు. దీంతో అప్పటి నుంచి దివ్యాంగుల జీ తన ఆటోలో వారిని గమ్యస్థానాలకు ఉచితంగానే చేరవేస్తున్నట్లు సైదులు తెలిపాడు.

'జయ' విద్యార్థులకు మెరుగైన ర్యాంకులు


అవనీష్


టి.తరుణ్


వి. నీతు


రాహుల్

సూర్యాపేట టౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రం లోని జయ జూనియర్ కళాశాలకు చెందిన బైపీసీ విద్యార్థులు శనివారం వెలువడిన నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకులు సాధించినట్లు కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. కళాశాలకు చెందిన వి. నీతు 22,360, అవనీష్ 31,548, డి. వంశీ 80,101, జి. రాహుల్ 1,55,808, టి. తరుణ్ 1,61,298వ ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. 13 మంది విద్యార్థుల్లో ఐదుగురు మెడికల్ సీట్లు పొందినట్లు చెప్పారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ అభినందించారు.

బైక్‌లు చోరీ చేస్తున్న బాలుడి అరెస్ట్


పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

మిర్యాలగూడ అర్బన్: బైక్‌లు చోరీ చేస్తున్న బాలుడిని మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వన్‌టౌన్ సీఐ మోతీరాం విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం చింతపల్లికి చెందిన నందిపాటి తరుణ్ మిర్యాలగూడలోని ఓ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. తన బైక్‌ను గత నెల 29న రాత్రి హాస్టల్‌లో పెట్టి నిద్రించాడు. మరుసటిరోజు చూసేసరికి బైక్ కనిపించలేదు. దీంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శనివారం ఉదయం మిర్యాలగూడలోని ఈదులగూడ చౌరస్తాలో పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా.. అటుగా బైక్‌పై వచ్చిన బాలుడు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా.. బైక్‌లు చోరీ చేసి విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. నిందితుడు గతంలోనూ హైదరాబాద్‌లో, ఏపీలోని పెనుగంచిప్రోలులో బైక్‌లు చోరీ చేశాడని, ఎస్ఆర్‌నగర్ పోలీసులు అతడి అరెస్ట్ చేసి నాంపల్లిలోని జువైనల్ కోర్టులో హాజరుపరిచే క్రమంలో కస్టడీ నుంచి తప్పించుకుని పారిపోయినట్లు సీఐ తెలిపారు. అతడి వద్ద నుంచి రూ.11.50 లక్షల విలువైన ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

నీట్‌లో సత్తాచాటిన 'ప్రగతి' విద్యార్థులు


ఎం. అశ్రిత


ఇందు

నల్లగొండ: నల్లగొండ పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు శనివారం విడుదలైన నీట్ ఫలితాల్లో సత్తాచాటారు. కళాశాలకు చెందిన కె. ఉజ్వల జాతీయ స్థాయిలో 501 మార్కులు, కె. ఇందు 428, ఎం. అశ్రిత 427, ఎం.శైని 407, అరిబా తబస్సుమ్ 385, మహీన్ 379 మార్కులు సాధించారని కాలేజీ చైర్మన్ చందాకృష్ణమూర్తి తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను డైరెక్టర్లు ఎ. నరేందర్‌బాబు, ఎస్. శ్రీధర్‌రావు, చందా శ్రీనివాస్, పైళ్ల రమేష్‌రెడ్డి అభినందించారు.

'గౌతమి' విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న గౌతమి కళాశాల యాజమాన్యం

నీట్ ఫలితాల్లో నల్లగొండ పట్టణంలోని గౌతమి కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఎండీ ఉజేర్‌కు 519 మార్కులు, పావని 472, యాస్మిన్ 467, పసుపులేటి లేఖన 428, అలీఖాన్ 397, తస్నీమ్ 385, హీబామైరుక్‌కు 347 మార్కులు పొందారు. విద్యార్థులను కళాశాల యాజమాన్యం కాసర్ల వెంకట్‌రెడ్డి, చల్లా వెంకటరమణ, రఘుపాల్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి అభినందించారు. అదేవిధంగా జోసా మొదటి రౌండ్ కౌన్సెలింగ్‌లో కళాశాలకు చెందిన ఆర్. శ్రీకర్ ఐఐటీ ధన్‌బాద్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ సీటు సాధించాడని, తేజస్వినికి ఎన్ఐటీ కాంచిపురంలో ఈసీఈ, ఎం. శివాజీకి ఎన్ఐటీ అగర్తలలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో సీట్లు పొందినట్లు యాజమాన్యం పేర్కొన్నారు.

'జాస్రిత' ప్రభంజనం


సదాఫ్


ఫహాద్

నల్లగొండ : నీట్‌లో నల్లగొండలోని జాస్రిత అకాడమీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఆఫియా సదాఫ్ 429మార్కులు, ఫహాద్ 416, రుమానా మారియ 412, వర్షిత 410, మారియ్ 410, సిరి 403 మార్కులు సాధించారు. ఆర్షియా తబస్సుమ్ 401, పల్లవి 381, అక్షర 380, దానియా 380, ఫరియా మేహవీష్ 377, బృందా 371, అనన్య శరోణ్ 360, రేష్మ 348, దీక్షిత 344, అక్షిత 331 మార్కులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు.